కథ

# లాభంలేదు

● గొల్లపూడి రాజ్యలక్ష్మి

*డియర్ జయా!*

రేపు గౌతమికి బయల్దేరి హరితోపాటు మీవూరు వస్తున్నాను. 'ఏమిటింత హఠాత్తుగా?' అని ఆశ్చర్యపోకు. హరి ఆఫీసు పనిమీద అక్కడి బ్రాంచిలో పనిబడి వస్తున్నాడు. అతనితోపాటు నేను కూడా! నీతో కొన్ని రోజులు గడపవచ్చని! అంతే! మిగతా కబుర్లు అక్కడికొచ్చాకే! వుంటాను...

ప్రేమతో కోమలి.

ఎంతో క్లుప్తంగా వున్న ఆ ఉత్తరం చూస్తూనే జయంతిలో ఎక్కడలేని ఉత్సాహం ఉరకలు వేసింది. ఆ రాత్రంతా నిద్రపట్టలేదు.

జయంతి, కోమలి ఒకే ఊళ్లో పుట్టి, పెరిగి ఒకే కాలేజీలో కలిసి చదువుకున్నారు. ఇద్దరి దృక్పథాలు వేరైనా ప్రాణం ఒక్కటే! తరచూ ఉత్తరాల్లో పలకరించుకుంటూన్నా ఇద్దరూ కలిసి నాలుగేళ్లయింది. నిద్రపట్టక అటూ ఇటూ పొర్లుతున్న జయంతి మీద విసుక్కున్నాడు సందీప్.

"ఏమిటిది? కుదురుగా పడుకోరాదూ?" అన్నాడు.

"రేపు ఉదయాన్నే స్టేషన్ కెళ్లాలి!" అంది జయంతి.

"ఇది నూటయాభైయ్యోసారి చెప్పడం!"

"వచ్చేది ఎవరనుకున్నారు?"



"ది గ్రేట్ కోమలాదేవి! ఇది కూడా నూటయాభైయ్యోసారి!"

"వ్యంగ్యం చాలు. ఇక పడుకోండి" అంది ఒళ్లుమండి.

"అదే నా ప్రయత్నం. నువ్వు కదలకుండా పడుకుంటే"

"హుఁ. ఆడది సంతోషంగా వుంటే చూడలేదండీ మీ మగజాతి" అని ఓ డైలాగ్‌తో కొడ్దామనుకుంది. మళ్లీ పోనీలే అని జాలిపడి ఊరుకుంది.

ప్రొద్దున్నే స్టేషన్ కెళ్లారిద్దరూ.

"హలో జయా!" చెయ్యి ఊపింది కోమలి. కంపార్ట్‌మెంట్ దగ్గరికి పరిగెత్తి చెయ్యి అందుకుంది జయంతి.

"ఇంత చలిలో స్టేషన్‌కి రాకపోతేనేం" అన్నది కోమలి ఆప్యాయంగా.

"రాకుండా వుండగలనా!" అంది జయంతి నవ్వుతూ.

"రాత్రంతా నిద్రపోలేదు మీ ఫ్రెండ్. నన్ను నాలుగుసార్లు లేపింది 'టైం అయిపోయిందంటూ" అన్నాడు సందీప్.

"ఔనా!" అంది కోమలి నవ్వి.

"మా స్నేహంలో వున్న గొప్పదనం మీకేం తెలుసు?" అంటూ సందీప్‌ని మోచేత్తో పొడిచింది జయంతి.

"సరేలే! ఇప్పుడు 'స్నేహబంధమూ ఎంత మధురమూ' అంటూ పాట మొదలెట్టకు. చెంపలు వాయించుకుంటున్నాను. తప్పయిపోయింది" అన్నాడు సందీప్.

కోమలీ హరీ పెద్దగా నవ్వారు.

ఆటో దిగి ఇంట్లోకి వస్తూ "వాకిట్లో అంత పెద్దముగ్గు నువ్వేనా వేసింది?" అనడిగింది కోమలి జయంతిని.

"ఔను... బావుందా?"

"ఇంకా నీకీ పిచ్చి పోలేదన్నమాట!"

"పుట్టుకతో వచ్చిన అభిరుచి అది. అందులోనూ ఇప్పుడు ధనుర్మాసం!"

"లాభం లేదు.. లాభం లేదు" అంది అసహనంగా కోమలి.

"నువ్విప్పుడేం మాట్లాడకు. నాకు చాలా పని వుంది. తీరిగ్గా పెట్టుకుందాం మీటింగు" అంది జయంతి కిచెన్‌లోకి నడుస్తూ.

స్నానపానాదులన్నీ అయ్యాక జయంతికెదురుగా కుర్చీ వేసుకుని కూర్చుంది కోమలి. కోమలితో మాట్లాడుతూనే చకచకా పని చేస్తోంది జయంతి.

"వీళ్లేరీ?" అనడిగింది కోమలి.

"ఎవరు?"

"అదే... మన ప్రాణనాధులు?"

"మామూలే! సగటు కొంపల్లోని మొగాళ్లంతా ఏం చేస్తుంటారు. అదే చేస్తున్నారు. చాలా సాంప్రదాయకంగా పేపర్ చదువుతూ... రాజకీయాల్లో మునిగి తేలుతూ..."

"అంటే?"

"అంత అర్థం కాకుండా మాట్లాడుతున్నానా?"

"వచ్చినప్పటినుంచీ... "అంటూ ఏదో అనబోయింది కోమలి.


"అర్థమైంది తల్లీ. పొద్దున్న వాకిట్లో ఆ ముగ్గు చూసినప్పట్నించీ నీ మూడ్ మారిపోయింది. నన్నెప్పుడూ వాయించేద్దామా అని చూస్తున్నావ్? అవునా?"

"నీకున్న ఈ తెలివి నీ వంటి మీద చూపిస్తే బావుంటుంది"


"నా వంటికేమైంది?" అంటూ పమిట సవరించి బొడ్లో దోపుకుంది. నడుం మీద చెయ్యుంచి దర్పంగా ఓ ఫోజిచ్చింది జయంతి.

"నడ్డీ నడుం కల్సిపోయి క్రితంసారి నిన్ను చూసినప్పటి కంటె ఓ పది కేజీలు పెరిగి వుంటావు! ఈ ప్రకారం మరో నాలుగేళ్లకు..."

"లేదే! వెయిట్ చూసుకుంటూనే వున్నాను. వయసుని బట్టి బరువు కదా? ఆ లెక్కన కాస్త ఎక్కువే అనుకో! అయినా మరీ తూచినట్లు



## ఈ బ్రిడ్జికి తలుపులున్నాయి!



లండన్ బ్రిడ్జ్ ఈజ్ ఫాలింగ్ డౌన్ అంటూ నర్సరీ పిల్లలు పాడే రైమ్ వినే వుంటారు. లండన్‌లో వున్న ఈ బ్రిడ్జి అతిపురాతనమైంది. థేమ్స్‌నది మీద వుంది. రాత్రిపూట లైట్ల వెలుగులో దాన్ని చూడటానికి ఒళ్లంతా కళ్లున్నా సరిపోవు. బ్రిడ్జిమీద అటుఇటు వరుసగా పరుగులు తీసే వాహనాలు. అటుఇటూ దీని మీద నడవాలనుకునే పర్యాటకులు, పగలంతా ఎంతో రద్దీగా వుంటుంది. నిత్యం ఎంత రద్దీవున్నా అతిపరిశుభ్రంగా వుంటుంది. దీనిమీద నడుస్తూ వుంటే ఎంతో గొప్పగా అనిపిస్తుంది. థేమ్స్‌నదిలో అటుఇటు తిరిగే లాంచీలు, దూరంగా లండన్ పార్లమెంటు భవనం, లండన్ ఐ అన్నీ కనిపిస్తాయి. ఎంత నడిచినా తనివి తీరదు. అలసట రాదు. ఇన్ని సంవత్సరాలైనా చెక్కుచెదరలేదు. పెద్ద యుద్ధనౌకలు వెళ్లటానికి వీలుగా అటుఇటు తలుపులు లేచినట్లు లేచి, మళ్లీ మూసుకుంటాయి. ఇది ఈ బ్రిడ్జి ప్రత్యేకత. ఇది ఎప్పటి ఏర్పాటో. అయినా ఇప్పటికీ పెద్ద నౌకలు గాని, తెరచాపవున్న పడవలు గాని వచ్చినప్పుడు ఈ బ్రిడ్జి తలుపు తెలుచుకున్నట్లుగా లేస్తుంది. అలా జరిగే ముందు ప్రజలకు తెలియజేస్తారు. మైకులో ఆ విషయం విన్న ప్రజలు, అది చూడటానికి ఉత్సాహంగా పరుగులు తీస్తారు.

పి.బి. జగన్నాయకీ

వుంచగలగటం సాధ్యమా?"

"నన్ను చూడు!"

"వచ్చినప్పట్నించీ చూస్తూనే ఉన్నానమ్మ. అక్కడక్కడా జుట్టు తెల్లబడింది. కళ్లకింద ఆ నల్లని వలయాలు..."

"నీ మొహం! అది కాటుక! కాస్త చెదిరినట్లుంది. ఇక తల అంటావా... ఇప్పుడు పదేళ్ల పిల్లలకే తలలు నెరిసిపోతున్నాయి. ఒకటీ, ఆరా ఉంటే ఏం పోయిందిలే?"

"ఔన్లే... పెళ్లయి పదేళ్లు దాటిపోయింది. ఇంకా ఎలా వుంటే యేంలే! మన మొగుళ్లు మనకేం విడాకులివ్వరు కదా!" అన్నది సాంబారులో పోపు పెడ్తూ జయంతి.

"అంటే! మన అందం, ఆరోగ్యం... ఆనందం అన్నీ... అన్నీ వాళ్లకోసమేనా? వాళ్లు మనతో కలిసి వుండటం కోసమేనా? లాభం లేదు... లాభం లేదు... నీలో ఏం మార్పులేదు"

కుక్కర్ మీద వెయిట్ పెట్టి తనూ స్టూల్ లాక్కుని కూర్చుంది జయంతి.

"ఊ... ఇక మొదలెట్టు... నీ ఉపన్యాసం ఇక మొదలెట్టు" అంది నవ్వుతూ.

"చూడమ్మా! మనిషన్నాక కాస్తయినా వ్యక్తిత్వం వుండాలి. ఇది నీ ఇల్లే! కాదనను. అందుకని ఇంతలా నిన్ను అర్పించుకోవాలా? నీకంటూ ఏదీ మిగుల్చుకోవా?"

"కోకేం! నాకంటూ ఓ ఇద్దరు పిల్లలూ... ఓ మొగుడూ... ఇంకా..."

"హాస్యం కాదు"

"నేనూ సీరియస్‌గానే చెప్పా!"

"లాభం లేదు.... లాభం లేదు. నీబుర్ర రిపేర్ కొచ్చింది. మొగుడూ, పిల్లలూ నీవాళ్లే... అది వొదిలేయ్, ఇంకా..."

"వొదిలేయాలా? ఎందుకు?" అమాయకత్వం నటించింది.

"ఎందుకా? నీ గురించి నువ్వు కాస్త ఆలోచించుకోవాలి కనుక!"

"ఏమని?"

"నువ్వు ప్రాథమికంగా ఒక మనిషివి. ఆ తర్వాతే భార్యవు. తల్లివి... అని"

"ఇది కొత్తగా తెలుసుకోవాల్సిన విషయం కాదే!"

"అన్నీ తెలిసే చేస్తున్నా వన్నమాట?"

"ఏం చేస్తున్నాను? అసలు నీ బాధ ఏమిటి కోమలీ?"

"నువ్వు పనిమంతురాలివే... ఒప్పుకుంటాను. అందుకని ఇంతగా ఒళ్లు విరుచుకోవాలా?"

"ఇది నా ఇల్లు... నా పని నేను చేసుకోవడంలో తప్పేంవుంది?"

"ఇదిగో... ఇదే నాకు మింగుడుపడదు"

"చూడు కోమలీ! అసలు విషయానికిరా!"

"మీ ఆయనేమిటి మరీ ఇలా తయారయ్యాడు?"

"నా కళ్లకు స్మార్టుగానే వున్నారే! ఉదయం వాకింగ్. ఆ తర్వాత యోగా... ఆ తర్వాత అవీ... ఇవీ... అన్నీ చాలా పద్ధతిగా చేస్తూ, తన వయసుని బరువుకి, ఆరోగ్యాన్ని కంట్రోల్లోనే వుంచుకుంటున్నారే!" అంది నవ్వుని దాచుకుని జయంతి.

"ఆరోగ్యం, అందం సరే! మనస్తత్వం గురించి..."

"ఇవాళ కొత్తగా అడుగుతున్నావేమిటి? నీకు ఎన్నోసార్లు చెప్పివుంటాను కూడా! నేనేం చేసినా నా జోలికి రారు పాపం! కాకపోతే... కాస్త ప్రథమ కోపం. అదేమంత పట్టించుకో తగినంత కాదు"

"అదే! ఆ ఉపేక్ష ఎందుకూ అని! ప్రొద్దుటి నుంచీ చూస్తున్నాను. పిల్లల పనీ నువ్వే. వంటపనీ నువ్వే., నడుం విరిగేలా చాకిరీ చేస్తున్నావు. పనిమనిషి పదిరోజులు దాకా రాదంటున్నావు. నీకు కొంచెమయినా సాయం చేయకుండా కాలు మీద కాలు వేసుకుని దర్జాగా కబుర్లు చెప్తున్నాడు మీ ఆయన. ఇదేమన్నా బావుందా?"

"అవుననుకో. కానీ తను హరికి కంపెనీ ఇవ్వాలి కదా!... అదీకాక ఆయన నాకు చేసే సాయం ఏముంది లెద్దూ"

"కిచెన్‌లో కొస్తే బోలెడంత వుంటుంది!"

"సరి... సరి... ఇక్కడన్నా మనం హాయిగా వుండొద్దా? కాళ్లకూ చేతులకూ అడ్డొస్తూ అదొక తలనొప్పి. నిజం చెప్పాలంటే వంటింట్లోకి ఆయన జొరబడటం నాకిష్టం వుండదే కోమలీ! అంత ఖర్మేం వచ్చిందాయనకు?"

"అంటే? వంట చేయటమనేది అంతకాని పనా? అదే నీ ఉద్దేశమైతే ఆ పని నువ్వు మాత్రం ఎందుకు చేయాలి?"


"నీకో విషయం తెలుసా కోమలీ? మగాడికి వంట తెలియకపోవడమే మంచిది. మనం ఏం గడ్డి పెట్టినా చచ్చినట్లు తింటాడు. అదే వంటొచ్చిన మగాడనుకో. మనం ఎంత బాగా చేసినా మెప్పించలేం. అందుకని వాళ్లని వంటగదికి దూరంగా వుంచాలి"

"చాలా పెద్ద సత్యం చెప్పాను" అనుకుంటున్నావేమో! చెత్తగా వుంది విశ్లేషణ. అసలు మగాడ్ని మెప్పించాలని చూడ్డం దేనికో నాకర్థం కాదు. మెప్పించాలనుకోవటమో, మన చేతలవల్ల మన్ని ప్రేమించాలనుకోవటమో ఎంత దివాళా కోరుతనమో ఎప్పుడన్నా ఆలోచించావా? అసలు ఈ మనస్తత్వమే బానిస లక్షణం. మెచ్చుకోగానే పొంగిపోతారేగానీ. ఆ మెప్పుదలతో మనని దువ్వి అడ్డమైన చాకిరీ చేయించుకుంటున్నారనే సంగతి గుర్తించరు. నడుం నెప్పి, మోకాళ్ల నొప్పులు ఆడవాళ్లకే ఎక్కువగా ఎందుకొస్తాయో తెలుసా?" అనడిగింది కోమలి.

"కొంపదీసి వాకిట్లో ముగ్గులు పెట్టినందుకు కాదుగదా?"

పెద్దగా నవ్వింది కోమలి.

"ఇప్పుడు దారిలో కొచ్చావు అమ్మడూ! రంగవల్లులు వేయటం అనేది ఒక కళే. ఒప్పుకుంటాను. కళ కదాని నడుములు విరగ్గొట్టుకోవటం దేనికి? అసలు ప్రొద్దున్నే లేచి దుమ్మురేగ్గొడుతూ వాకిలి ఊడవటం, నీళ్లు చల్లి, గంటల తరబడి వొంగి ముగ్గులేయటం వగైరా అనారోగ్యప్పనులు ఆడవాళ్లకప్పజెప్పారే. వాళ్లననాలి. ఒక్కడంటే ఒక్కమగాడైనా చీకట్నే లేచి వాకిలి వూడుస్తాడా? ముగ్గులేస్తాడా? లేదు. హాయిగా గుర్రుపెడుతూ పడుకుంటాడు. అంతగా అయితే లేచి వాకింగ్‌కి వెళతాడు. ఉదయపు అందాన్ని ఆస్వాదిస్తూ. మన ఆడవాళ్లు మాత్రం వంటిళ్లలో పడి ఆయనగారికి, పిల్లలకి అడ్డమైన చాకిరీ చేస్తూ సతమతమై పోతూంటారు. ఎంత తేడా?"




"ఊరికే తెగ ఆవేశ పడిపోకు కోమలీ? ఆడవాళ్లల్లో కూడా చైతన్యం వచ్చింది. ఇవాళ జిమ్‌లూ, బ్యూటీక్లినిక్‌లూ ఎలా బ్రతుకుతున్నాయనుకుంటున్నావ్? టి.వి.లో చూడ్డంలేదూ. ఏరోబిక్స్

ఎంతబాగా చేస్తున్నారు ఆడపిల్లలు?"

"ఔను. ఆడపిల్లలే! తల్లులెవరైనా ఉన్నారా?"

"లేరంటావా?"

"డబ్బున్న పై తరగతి ఆడవాళ్లను వొదిలేయ్. మధ్యతరగతి మహిళల సంగతి నేను చెప్పేది!"

"అంత తీరికా, డబ్బూ వుండాలి కదా!"

"అదే... ఆ 'తీరిక' ఎందుకని లేకుండా పోతోంది! ఉద్యోగం చేసే స్త్రీల సంగతి అటుంచు. ఏ ఉద్యోగంలేని ఆడవాళ్లు తమ సమయాన్నంతా భర్తకి, పిల్లలకి వినియోగించి 'తీరిక ఏది?' అని సమాధాన పడుతున్నారు. రోజుకి కనీసం ఇరవై నిమిషాలన్నా ఇంట్లో తీరిగ్గా వ్యాయామాలు బోలెడున్నాయని, రోజుకోరకం వివరిస్తూ పేపర్లో వస్తూనే వున్నాయిగా?"

"నువ్వింక మారవా కోమలీ? ఎప్పుడూ 'ఆడవాళ్లూ...చాకిరీ' అంటూ అదే గోలా? ఇంక లోకంలో సమస్యలే లేవా? వచ్చినప్పటి నుంచి ఈ విషయం మీద ఎక్కువ మాట్లాడుతున్నావ్! ఏమిటి సంగతి?"

"మా పిన్ని కూతురు శమంత లేదూ? నీకు తెలుసు కదా!"

"తెలీకేం. తెల్లగా, సన్నగా చాలా అందమైన పిల్ల"

"అంత అందమైన పిల్లనీ ఇప్పుడు నువ్వు చూస్తే గుర్తుపట్టవ్!"

"ఏం? అంత చిక్కిపోయిందా?"

"చిక్కటం కాదు. అడ్డంగా పెరిగి అసహ్యంగా తయారైంది. రెండు గడ్డాలు, విపరీతమైన నడ్డి. పెళ్లయి ఓ పిల్ల పుట్టిందో లేదో, దాని స్వరూపమే మారిపోయింది."

"పాపం!" జాలిపడింది జయంతి.

"జాలిపడే పరిస్థితే మరి. స్థూలశరీరంతో అంత బాధపడుతున్నా, తీసుకునే ఆహారంపై నియంత్రణ లేదు. స్వీట్లంటే విపరీతమైన ఇష్టం. అదేమంటే తినే వయసులోతినాలి. ఇప్పట్నించే నోరు కట్టుకోమంటావా? అంటుంది. దానికెట్లా నచ్చచెప్పాలో నాకు అర్థం కాలేదు."

"పాపం... కాన్పులో వచ్చివుంటుంది వొళ్లు"

"ఔను. ప్రసవం అయ్యాక 'పాలిచ్చే తల్లివి' అంటూ అమ్మలు, అమ్మమ్మలు తెగ తినిపిస్తారు. వీళ్లు బాగా తిని రోడ్డురోలర్లా తయారవుతారు. అప్పుడే డాక్టర్ సలహాలతో కొన్ని వ్యాయామాలు చేస్తే ఇంత యాతన వుండదు కదా!"

"ఆరోగ్యమే మహాభాగ్యం" అన్న సూక్తి అందరికీ తెల్సిందే కదా! ఇవాళ వైద్యవిజ్ఞానం బాగా పెరిగింది. జనాలకి అర్థమయ్యేలా విరివిగా పత్రికల్లో ప్రచారమవుతూనే వుంది. అలాంటప్పుడు మనకెందుకీ కంఠశోష? అంది జయంతి 'వదిలేయ్' అన్నట్టుగా.

"జయా! వంటైందా?" అంటూ సందీప్ ముందు గదిలోంచి అరిచాడు.

"ఆ... ఇదిగో అయిదు నిమిషాలు" అంటూ మళ్లీ స్టౌ దగ్గరకెళ్లింది జయంతి.

"బావుంది... నీ కథాకళి. రోజూ ఇంతేనా?"


"ఇవాళ ఆదివారం కదా! రోజూ అయితే ఆయన్ని, పిల్లల్ని పంపేసి హాయిగా ఈ టైంలో టి.వి.లో సీరియల్స్ చూస్తూ కూర్చుంటాను" అంది జయంతి మిక్సీలో పచ్చడి చేస్తూ.

"సీరియల్స్ చూస్తావా?"

"ఔను... నువ్వు చూడటం లేదా?"

"ఏమున్నాయి వాటిల్లో? ఎప్పుడు టి.వి. ఆన్ చేసినా ఆడవాళ్లు భోరున ఏడుస్తూ మాట్లాడుతూ కన్పిస్తారు. ఏ ఛానల్ మార్చినా ఇదే దృశ్యం. వాళ్లని ఏడిపించటంలో అంత ఆనందం ఏమిటో మరి?" అంది కోమలి.

"అన్నట్టు కోమలీ... ఈ మధ్య ఒక కొత్తమార్పు కన్పిస్తోంది. గమనించావా? మొన్నటిదాకా ఆడదాని కష్టాలకి, తలరాతకి కారణం మగవాడి విలనిజమే కదా! ఇప్పుడది బోర్‌గా వుందికాబోలు. ఏ సీరియల్ చూసినా ఆడవిలన్లు ఆడవాళ్లను ఏడిపిస్తూ, ఛాలెంజ్‌లు చేస్తూ, కాపురాల్ని నాశనం చేయటానికి కొత్త కొత్త పన్నాగాల్ని అతి తెలివి తేటలతో పన్నుతూ వుంటారు. భలే. ఆడవాళ్లల్లో ఎంత చైతన్యమో చూడు. ఒకర్నొకరు జుట్టుపట్టుకుని గుంజుకోవటం, చెంపలమీద ఫెడీ, ఫెడీమని బాదటం.... ఓహ్... అదెంతో సహజమన్నట్లుగా చూపటం... పైగా వాళ్లు కూలీ, నాలీ చేసుకునే క్రింది తరగతివాళ్లు కారు... చూడటానికి ఎంత రోతగా వుంటుందో తెలుసా?" అంది జయంతి.




"టి.వి. ఛానల్స్‌ని బాగానే అధ్యయనం చేస్తున్నావన్నమాట!"

"ఏదో... కాస్త తీరిక దొరికినప్పుడు... ఏం తోచక!"

"ఇట్లా దుర్వినియోగం చేయకపోతే ఏదైనా పనికొచ్చేపని చేయొచ్చు కదా?"

"పనికొచ్చే పని బావుంది. ఈ శీర్షికతో ఏదైనా రాయొచ్చు"

"అదే నేను చెప్పేది. చదువుకునే రోజుల్లో నువ్వు కవితలు గట్రా రాసేదానివి కదా!"

"నువ్వు కూసేదానివి... నేను రాసేదాన్ని"

"ప్రాస బావుంది. నేను చెప్తున్న దానిమీద మనసుపెట్టి ఆలోచించు!"

"బాబోయ్... ఇప్పుడట్లాంటి ఆలోచనలేం పెట్టుకోకండి! మా కడుపులు మాడిపోతున్నాయ్... ముందు మా భోజనాల సంగతి చూడండి" అంటూ సందీప్ వచ్చాడు నవ్వుతూ.

"సారీ... లేటైంది కదూ! కబుర్లలో పడి 'టైం' చూడలేదు. వంట రెడీ! ఇదిగో రెండు నిమిషాల్లో వడ్డించేస్తాను" అంటూ హడావుడి పడింది జయంతి.

సందీప్ నవ్వుతూనే అన్నా కోమలి ముఖంలో కాస్త అసహనం చోటు చేసుకుంది. 'ఆడవాళ్లు కాస్త సరదాగా వుంటే చూడలేరీ మగవాళ్లు... లాభం లేదు... లాభం లేదు...' అనుకుంది లోలోపల పళ్లు నూరుకుంటూ...

"పాపం... ప్రొద్దుట్నించీ పనంతా ఒంటిచేత్తో చేస్తోంది" అంది పైకి.

"తనకి అలవాటే లెండి! పదిమంది వచ్చినా వండి పెడ్తుంది. తనకి ఆ కెపాసిటీ వుంది... ఇదొక లెక్కా?" అన్నాడతను.

"నిజమే... ఇదెంత పని అని? నువ్వూరికే ఫీలవకు. ఇదిగో కంచాలు పెట్టేస్తున్నా. పద. నువ్వు కూడా భోం చేద్దువుగాని" అంది జయంతి. అప్పటికి ఊరుకుంది కోమలి.

భోజనాల సమయంలో జయంతి కూతురు స్వాప్నిక తెగ పేచీలు పెట్టటం, జయంతి విసుక్కుంటుంటే సందీప్ బుజ్జగించడం గమనిస్తూనే వుంది కోమలి.

"మీ పిల్లల్ని కూడా తీసుకొస్తే

బావుండేది" అన్నాడు హరితో సందీప్.

"ఎందుకు లెండి... వాళ్లకు తోక ఒక్కటే తక్కువ. వచ్చివుంటే ఏమాత్రం స్థిమితం వుండేది కాదు మాకు!" అంది కోమలి.

"అల్లరి పిల్లల సహజలక్షణం. చేయకపోతే బాధపడాలి" అన్నాడు సందీప్.

"నేనూ అదే చెప్తాను. 'క్రమశిక్షణ వుండాలి!' అంటూ వాళ్లను రాచిరంపాన పెడ్తుంది కోమలి. అందుకే వాళ్లమ్మను చూస్తే వాళ్లకు హడల్!" అన్నాడు హరి.

"మీరు మరీను... మన సుఖంకోసం వాళ్లని దండించాలా? అభం శుభం తెలీని పసివాళ్లను ప్రేమతో, లాలనతో నచ్చచెప్పాలి. నాకైతే పిల్లల్ని కొట్టటం, విసుక్కోవటం ఏమాత్రం నచ్చదు. ఆ మాత్రం ఓర్పులేకపోతే పిల్లల్ని కనడం దేనికి?" అన్నాడు సందీప్.

"పిల్లల కోసం త్యాగాలు చేస్తూ ఓర్పు.. సహనం అంటూ జీవితాన్ని ఉదాశీనంగా భరిచటం కంటే మీరన్నట్టు పిల్లల్ని కనకపోవటమే మంచిది. ప్రేమ వుండాలి కాదనను. కాని దానికోసం మన మనశ్శాంతిని కోల్పోకూడదు. ఎంతవరకు వాళ్లను ప్రేమించాలో... అంతవరకే! అంతకు మించితే బాధపడేది మనమే. మనం వాళ్లకోసం ఎంత చేసినా అది మన బాధ్యతగా భావిస్తారే తప్ప. త్యాగమని పిల్లలు ఎదిగాక ఒప్పుకుంటారా? ఎన్నిగాథల్ని వినటం లేదు? ఏరుదాటాక తెప్ప తగలేసినట్టుగా ఎంతమందిపిల్లలు తల్లిదండ్రులపట్ల కృతఘ్నత చూపటంలేదు? వాళ్లకోసం తాము చేసిన త్యాగాల్ని తల్చుకుని ఎంతమంది తల్లిదండ్రులు కుమిలిపోవటం లేదు. వాళ్లనుంచైనా మనం గుణపాఠం నేర్చుకోవద్దా?" అంది కోమలి కాస్త తీవ్రంగా.

సందీప్ కోమలి ధోరణికి ఆశ్చర్యంతో చూస్తుండిపోయాడు.

వాతావరణం కాస్త వేడెక్కిందని గ్రహించిన హరి తేలిగ్గా నవ్వుతూ...

"మా కోమలికి చాలా ముందుచూపులెండి. ఎంతంటే మా వృద్ధాప్యంలో ఎవరిమీదా ఆధారపడకూడదని ఇప్పుడే ఓల్డేజ్‌హోం వెతికి పెట్టకుంటోంది" అన్నాడు.

"వెటకారాలు వద్దు. అది చాలా మంచి పద్ధతని ఆలోచనవున్న ఏ బుర్రకయినా తడుతుంది" అంది కోమలి.

"అబ్బో... సాంబారు చాలా ఘాటుగా వుంది జయా! మిరియాలు ఎక్కువైనట్టున్నాయి" అన్నాడు సందీప్.

"మాట్లాడకుండా తినండి! వంకలు పెట్టారంటే నేను కూడా మా కోమలిలాగా మగవాడి ఆధిపత్యాన్ని నిరశిస్తూ వంటని బాయ్‌కాట్ చేస్తాను" అంది జయంతి నవ్వుతూ.

"సాంబారులో మిరియాలు కాదు డాడీ... ములక్కాడ వుంది" అంది స్వాప్నిక ముక్క చీకుతూ.

అప్పటికి ఆ సన్నివేశం చల్లబడింది.

000

నాలుగురోజుల తర్వాత రాత్రి ఆరుబైట కుర్చీలు వేసుక్కూర్చున్నారు జయంతి కోమలిలు.

లోపల హాల్లో హరి, సందీప్ టి.వి.లో న్యూస్ చూస్తున్నారు. పిల్లలు నిద్రపోతున్నారు.

"ఈ నాలుగురోజులు నీతో క్షణాల్లా గడిచినయ్ కోమలీ! మళ్లీ మనం ఎప్పుడు కలుస్తామో!" అంది జయంతి.

"నీ సంగతి సరే గానీ... మీ ఆయన మాత్రం మేము వెళ్లగానే చాలా రిలీఫ్‌గా ఫీలవుతాడు" అంది కోమలి.

"ఛ. అదేంలేదు. సందీప్‌కు మీరు రావటం ఎంతో సంతోషంగా వుంది. నీకు తెలీదు గానీ అతనికి ఇలా బంధుమిత్రులు రావటం, సందడిగా వుండటం ఇష్టం. అయినా అతను మీవల్ల ఇబ్బందిగా ఫీలయ్యాడని ఎందుకనుకుంటున్నావు?" అంది జయంతి.

"ఎందుకో అలా అన్పించింది. నాకు కాస్త ఆవేశం ఎక్కువ. నేను మాట పడను. ఆడవాళ్లనెవరైనా కించపరిస్తే సహించలేను. అందువల్ల అతన్నెప్పుడైనా నొప్పించానేమో!"

"అలా ఎప్పుడూ అనుకోకు. నీ ఆవేశంలో న్యాయంవుంది. దాన్నెవరూ కాదనలేరు. కానీ..." అని ఆగిపోయింది

"ఆగిపోయావేం? చెప్పటానికి సంకోచిస్తున్నావంటే ఏదో నీకు నచ్చని అంశం నాలో వుందన్నమాట!"

"ఇవాళ నీలో కొత్తగా చూసే విషయం ఏముంది కోమలీ? చిన్నప్పట్నించీ నీ గురించి



తెల్సినదాన్ని. నీ స్వభావం నాకు తెలీదా? ఏదో చేయాలని, అజ్ఞానంలో అమాయకత్వంలో వున్న ఆడవాళ్లను సంస్కరించాలని... తపన! అయితే ఎంతో తెలివిగా వుండే నువ్వు కొన్ని విషయాల్లో చాలా అమాయకత్వంగా ప్రవర్తిస్తున్నావ్... అదే నాకు మింగుడు పడటం లేదు.

కోమలి జయంతి ముఖంలోకి అర్థం కానట్టు చూసింది.

"నిన్నో ప్రశ్న అడుగుతాను. ఆలోచించి జవాబు చెప్పు. నిజంగా ఆడది ఇవాళ నువ్వనుకున్నంత దయనీయస్థితిలో వుందా? మనం చెప్తే గానీ తెల్సుకోలేనంత అయోమయ పరిస్థితిలో వుందా?"

"ఇందులో ఆలోచించాల్సింది ఏముంది? నా జవాబు వుందనే!"

"లేదని నేను ఖచ్చితంగా చెప్పగలను. ఇవాళ్టి స్త్రీకి చదువున్నది. తనకాళ్ల మీద నిలబడగల ఆత్మస్థైర్యం, ఆర్థిక స్వాతంత్ర్యం వుంది. చేయాలనుకున్నది చేయగల చేవ వుంది. ఎటువంటి వత్తిడినైనా ఎదుర్కోగల ఆత్మధృతి వుంది. సరే... అదలా వుంచు. ఎంతసేపూ నువ్వు నీ దృష్టితో ఎదుటివాళ్ల పరిస్థితుల్ని బేరీజు వేస్తున్నావు. అది పొరపాటు అన్పిస్తుంది నాకు. నీ మనస్తత్వం, సిద్ధాంతాలు... అలవాట్లు నీవి. అలాగే ఎవరి మనస్తత్వాన్ని బట్టి వాళ్ల ఆలోచనలు, పరిధులు వాళ్లకుంటాయి. నీకు న్యాయం అన్పించింది నాకు విడ్డూరం కావచ్చు కదా! ఉదాహరణకు శమంతనే తీసుకో. తనేదో కోల్పోతోందని నువ్వెందుకు బాధపడతావు? ఆమె సంతోషంగా, సుఖంగానే ఉంటోందిగా? అది సంతోషం కాదని నువ్వు ఎందుకు అపోహపడతావు? ఏది సుఖం? ఏది ఆనందం అన్నది వారి, వారి మనసునుబట్టే కదా వుండేది?"

"ఇది వేదాంతం!"

"కాదు. జీవిత సత్యం. నీ ఆలోచనా పరిధిని కాస్త విస్తరింపచేసి చూడు. నీ దృష్టితో కాదు. ఎదుటి మనిషి దృక్కోణం నుంచి. అప్పుడు సమస్య రూపమే మారిపోతుంది. ప్రయత్నించు" అంది జయంతి.

కోమలి జయంతి చెప్పినదంతా విని కాసేపు మౌనంగా వుండిపోయింది. ఆ మౌనంలోనే అంతర్మథనం మొదలైంది.

"లాభంలేదు... లాభం లేదు... నన్ను నేను సంస్కరించుకోవాల్సిన అవసరం కల్పిస్తోంది" అనుకుంది నిట్టూరుస్తూ...

■